క్లుప్తంగా

విజయరాజును కలిసిన సత్యవేణి



విజయరాజుని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసిన సత్యవేణి

జంగారెడ్డిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన గురవాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్యవేణి గురువారం పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారమే లక్ష్యంగా మహిళా విభాగాలు, పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని విజయరాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



లక్కవరంలో విద్యార్థులను అభినందించిన ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన లక్కవరం హైస్కూల్ విద్యార్థులు కూరాకుల సిరి, సువర్ణ, గీతికలను గురువారం ఆయన అభినంధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సొసైటీ చైర్మన్ దల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో...



రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కృష్ణకాంత్ పాఠక్‌కు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కృష్ణకాంత్ పాఠక్ గురువారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, అర్చకులు తూర్పు రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను ఈఓ త్రినాథరావు అందజేశారు.

భానుడి భగభగలు



ఎండ తీవ్రతకు పోలవరంలో నిర్మానుష్యంగా మారిన రోడ్లు

పోలవరం రూరల్: భానుడి భగభగలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతూ మధ్యాహ్న సమయానికి 40 డిగ్రీలకు పైగా నమోదవుతోంది. దీంతో పోలవరం మండలంలో గత వారం రోజులుగా ఉదయం 11 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడి ప్రభావం తీవ్ర స్థాయిలో ఉండటంతో ప్రజలు ఇళ్లకు పరిమితం అవుతున్నారు. ప్రధాన రహదార్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపారుస్తులు మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసివేస్తున్నారు.

అన్నసమారాధనలు

కొయ్యలగూడెం: శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం పలు ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కొయ్యలగూడెం వాటర్ ట్యాంక్, తూర్పుపేట రామాలయాల వద్ద నిర్వహించిన అన్నసమారాధనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మహిళలు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. కన్నాపురం, రాజవరం, పరింపూడి, బయ్యన్నగూడెం, దిప్పకాయలపాడు గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: 33/11 కేవీ రాజుపోతేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొత్తగూడెం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. కావున రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెరవేరిన సొంతింటి కల

- జగన్ పాలనలో పేదలకు పక్కా ఇళ్లు
- నియోజకవర్గంలో 9,514 గృహాలు మంజూరు
- వేగంగా నిర్మితమవుతున్న జగనన్న ఇళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



కామవరపుకోట మండలం తాడిచర్లలో నిర్మాణం పూర్తి కావచ్చిన కాలనీ

చింతలపూడి: సొంత ఇల్లు సగటు మనిషి జీవితాంతం కనే కల. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సొంత గూడుకు నోచుకోని నిరుపేదల సొంతింటి కలలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. ఇంటి స్థలం మంజూరు చేయడమే కాక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తోంది. అంతే కాక ఇళ్లు నిర్మించుకోలేనివారికి ఇళ్లు కూడా నిర్మించి ఇస్తోంది. దీంతో నియోజకవర్గంలో అక్క చెల్లెమ్మల సొంతింటి కలలు నెరవేరబోతున్నాయి. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు అనే నినాదంతో ప్రభుత్వం పేదలకు పక్కా గృహాలు మంజూరు చేసింది. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో గృహనిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు నిర్మించుకోవాలంటే కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇల్లు మంజూరు అయ్యాక కూడా బిల్లులు సకాలంలో విడుదల కాక సొంతింటి కల నెరవేర్చుకుందామనుకున్న పేదలు అప్పుల ఊబిలో కూరుకుపోయేవారు. కొందరైతే మధ్యలోనే ఇళ్ల నిర్మాణాలు అర్థాంతరంగా ఆపేసే వారు. సొంత ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేక అద్దె ఇళ్లల్లో మగ్గిపోయే వారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఇళ్ల మంజూరు దగ్గర నుంచి బిల్లుల చెల్లింపులో కూడా పారదర్శకత తీసుకురావడంతో ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు రూ.170 కోట్లు వెచ్చిస్తుండటంతో నిర్మాణాలు జోరందుకుని చాలా వరకు పూర్తి కావచ్చాయి.

నియోజకవర్గంలో గృహనిర్మాణ శాఖ ద్వారా మొత్తం 9,514 గృహాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 5,277 ఇళ్లు పూర్తయ్యాయి. వివిధ దశల్లో 1,967 గృహాలు ఉండగా 1,903 గృహాలు ప్రారంభం కావాల్సి ఉంది. మండలాల వారీగా చూస్తే చింతలపూడి మండలంలో 2,750 ఇళ్లు మంజూరు కాగా 950 ఇళ్లు పూర్తయ్యాయి. 700 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 900 ఇళ్లు ప్రారంభించాలి. అదే విధంగా కామవరపుకోట మండలంలో 1,778 ఇళ్లు మంజూరు కాగా 1,234 ఇళ్లు పూర్తయ్యాయి. 278 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 266 ఇళ్లు ప్రారంభం కావాల్సి ఉంది. లింగపాలెం మండలంలో 2,818 ఇళ్లు మంజూరు కాగా 1,850 ఇళ్లు పూర్తయ్యాయి. 568 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 400 ఇళ్లు ప్రారంభించాలి. జంగారెడ్డిగూడెం మండలంలో 2,168 ఇళ్లు మంజూరు కాగా 1,243 ఇళ్లు పూర్తయ్యాయి. 421 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 337 ఇళ్లు ప్రారంభించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మాది జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం. సొంతిల్లు లేక ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో ఇబ్బందులు పడ్డాము. సొంత ఇంటి కోసం చాలాసార్లు దరఖాస్తులు పెట్టుకున్నా రాలేదు. ఎన్నో ఏళ్లుగా కలలు గన్న సొంతింటి కల జగనన్న ప్రభుత్వంలో నెరవేరడంతో ఎంతో ఆనందంగా ఉంది. నిరుపేదలమైన మాకు ఇంటిని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. మాలాంటి ఎంతో మంది నిరుపేదలకు ఈ ప్రభుత్వంలో సొంత ఇళ్లు మంజూరయ్యాయి.

– యర్రా మౌనిక దీపిక, నాగేంద్ర, శ్రీనివాసపురం



జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో పూర్తయిన జగనన్న కాలనీ ఇళ్లు



చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ



లింగపాలెం మండలంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్న దృశ్యం

సచివాలయం.. గ్రామ స్వరాజ్యం

బుట్టాయగూడెం: గ్రామ స్వరాజ్య పాలన దిశగా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలో ప్రధానమైనది సచివాలయ వ్యవస్థ. ప్రతి పంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజలకు అక్కడే సులువుగా సమస్యల పరిష్కారం.. మెరుగైన సేవలు అందించేలా పనిచేస్తున్న ఈ సచివాలయ వ్యవస్థ దేశంలోనే చాల రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంది. దీనితో పాలన అత్యంత సులువైంది. కుల, ఆదాయం, జనన ధ్రువపత్రాల నుంచి రేషన్‌కార్డులు, రిజిస్ట్రేషన్లు వరకూ అన్ని పనులు సచివాలయాల్లోనే పూర్తి చేస్తున్నారు. దళారీ వ్యవస్థ కనుమరుగైంది. అవినీతికి చోటులేకుండా పోయింది. గత ప్రభుత్వాల పాలనలో ప్రజలు ప్రతి పనికి మైళ్లదూరం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ కారణంగా డబ్బులు, సమయం వృథా అయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పూర్తిగా మార్పు వచ్చింది. ప్రజలే ఆశ్చర్యపోయేలా ఏ ప్రభుత్వ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరగకుండా గ్రామంలోనే పనులు పూర్తి అవుతుండటంతో వ్యయప్రయాసాల బాధ తప్పిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీరు

గతంలో ప్రభుత్వం ఏ పథకం అమలు చేస్తుందో.. వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో.. ఎవరిని సంప్రదించాలో అనే విషయం ప్రజలకు తెలిసేది కాదు. ఇప్పుడు వలంటీర్లు ఇళ్లకు వచ్చి పథకాలు వివరించి, వారే దరఖాస్తులు చేస్తున్నారు. సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరుస్తున్నారు. వృద్ధులు, వితంతువులకు ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ సచివాలయ వ్యవస్థతో ప్రధానంగా ప్రజల ఆత్మగౌరవం పెరిగింది.

నియోజకవర్గంలో సచివాయాలు – 107
అంచనా వ్యయం – రూ. 44 కోట్ల 87 లక్షలు
గ్రామ సచివాలయ ఉద్యోగులు – 164 మంది
వలంటీర్లు – 1647 మంది



బుట్టాయగూడెం గ్రామ సచివాలయం



వేలేరుపాడు గ్రామ సచివాలయం



పోలవరం గ్రామ సచివాలయం



జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో..



టి.నర్సాపురం గ్రామ సచివాలయం



కొయ్యలగూడెం మండలం సీతంపేటలో..

చివరిరోజు పోలవరానికి 15 నామినేషన్ల స్వీకరణ

బుట్టాయగూడెం: నామినేషన్‌ల స్వీకరణ చివరి రోజు గురువారం 15 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కాకా కృష్ణ, బాడిస బుజ్జిదొర, మొడియం శ్రీనివాసరావు, సరియం సూరమ్మ, సోదెం ముక్కయ్య, బొరగం రాధ, ముజ్జిక రంజిత్‌కుమార్, అప్పలరాజు దొర, కర్రెద్దుల హేమమాలిని ఒక్కొక్కరు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీఎస్పీ అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరరావు ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థులు దువ్వెల సృజన రెండు సెట్లు, దువ్వెల ప్రవీణ్‌కుమార్ ఒక సెట్, సున్నం ప్రియాంక ఒకటి చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. అలాగే భరత్ ఆదివాసీ పార్టీ తరఫున మొడియం శ్రీనివాసరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున బంధం బాలరాజు ఒక సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

జగన్ గెలుపే మన లక్ష్యం



జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత మనందరిపైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో గురువారం వారు పార్టీ నేతలతో కలిసి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పేదరికం ఉండకూడదనే ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్ డీబీటీ పద్ధతి ద్వారా బడుగు, బలహీన వర్గాలకు, పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా అందించారన్నారు. దీంతో నేడు రాష్ట్రంలో పేదరికం స్థాయి చాలా వరకు తగ్గిందని అన్నారు. అలాగే రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్న వైఎస్ జగన్‌ను గెలిపించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కంచర్ల వాసవీరత్నం, ముప్పిడి అంజి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాసర తులసీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డు ధరకు వర్జీనియా పొగాకు



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రికార్డు ధరకు చేరుకోవడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో గురువారం వేలం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో నాణ్యమైన పొగాకు ధర రూ.303కు చేరి చేరి రికార్డు సృష్టించింది. దిప్పకాయలపాడు, అంకాలగూడెం, కొయ్యలగూడెం గ్రామాలకు చెందిన రైతులు తమ బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా ప్రారంభించిన కొద్ది సమయానికి రికార్డు ధరకు బేళ్లు అమ్ముడుపోయాయి. 638 బేళ్లు వేలం కేంద్రానికి రాగా 498 బేళ్లు అమ్ముడుపోయాయి. 25 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పోటీపడి పొగాకు బేళ్లు వేలంలో దక్కించుకున్నారు. అత్యల్ప ధర రూ.236 నమోదుకాగా రూ.283.89 సరాసరి ధర లభించిందని మార్గరెట్ పేర్కొన్నారు. మున్ముందు ధర మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

మలేరియా నిర్మూలనపై అవగాహన తప్పనిసరి

కొయ్యలగూడెం: మలేరియా రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బయ్యనగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బయ్యనగూడెం, రామానుజపురం గ్రామాల్లో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు వి.సత్యనారాయణ, ఎం.గీతారాణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల్లో వాడిపడేసిన కొబ్బరి బోండాలు, డిస్పోజబుల్ గ్లాసులు, పాత పగిలిన కుండ పాత్రలు, పాత టైర్లు తొలగించాలన్నారు. డ్రైయినేజీలో ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమలు చనిపోతాయని, మంచి నీటి తొట్టెలపై మూతలు వేసుకోవాలని సూచించారు. కొయ్యలగూడెంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యాధికారి ఎస్తేరు రాణి, మంగారావు సీహెచ్ జానకిరామ్, ఎల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బయ్యనగూడెంలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో మలేరియాను పూర్తిగా అరికట్టే విధంగా సంబంధిత అధికారులు కచ్చితమైన ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మలేరియా దోమలు వృద్ధి చెందకుండా గ్రామాల్లో నిర్ణీత సమయంలో మలేథియాన్ స్ప్రేయింగ్ పనులు అన్ని దశల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమతెరల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మేరీ కేథరిన్, ఇన్‌చార్జి డీఎంఓ జె.సురేష్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణతో పాటు మలేరియాను సమూలంగా నిర్మూలించవచ్చునని డా నవేష్, డా గీతా పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం యర్రగుంటపల్లిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్ శంకర్, రాజారావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జంతువుల సంరక్షణే ధ్యేయంగా పశువైద్య సేవలు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో ప్రపంచ పశు వైద్య దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మల్లంపల్లి సాయి బుచ్చారావు మాట్లాడుతూ జంతువుల సంరక్షణే ధ్యేయంగా పశు వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇమ్యూనాలజికల్స్ వారు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను అందజేశారు. వర్షా గ్రూప్ సీఈఓ డాక్టర్ రజినీకాంత్, పశువర్ధక శాఖ ఏడీ శేఖర్ దొర, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ విద్య, ఏవీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేసి గెలిపించండి



సాగిపాడులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



వ్యవసాయ కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న కంభం విజయరాజు

కామవరపుకోట: రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవటం ఖాయమని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. గురువారం మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తడికలపూడి గ్రామపంచాయతీ రత్నగిరి నగర్‌లో రత్నా తులసి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాగిపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రత్నగిరి నగర్, సాగిపాడు, వీరంపాలెం, కళ్ళచెరువు, పోలాసిగూడెం, కేఎస్ రామవరం, గుంటుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో మహిళలు విజయరాజుకు హారతులు ఇస్తూ, పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరు తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమీ రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, నూజివీడు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోరుముచ్చు గోపాల్, సర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, ఎంపీటీసీ బూరుగు శ్రీను, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చింతలపూడికి 22 నామినేషన్ల దాఖలు

చింతలపూడి: నామినేషన్లు గడువు ముగిసేసరికి చింతలపూడి అసెంబ్లీ స్థానానికి 12 మంది 22 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల ఆఖరి రోజైన గురువారం 6 గురు నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. వీరిలో నామినేషన్ల గడువు ముగిసేసరికి ఎంత మంది బరిలో ఉంటారో తేలాల్సి ఉంది. పార్టీల వారీగా నామినేషన్ల వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య తెలిపారు. ప్రధాన పార్టీల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కంభం విజయరాజు, టీడీపీ అభ్యర్థిగా సొంగా రోషన్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నమట్ల ఎలీజా నామినేషన్లు వేశారు. వీరు కాక ఐదుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో 132 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.70 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ట్రెజరీలో జమ చేసినట్లు తెలిపారు. రూ.కోటి 29 లక్షల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



కె అద్దయ్య, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

మేడే కరపత్రం విడుదల

జంగారెడ్డిగూడెం: కార్మిక వర్గాన్ని మతపరంగా విభజించే బీజేపీ విద్వేష విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ కేంద్ర కమిటీ ప్రచురించిన 138వ మేడే కరపత్రాన్ని గురువారం జంగారెడ్డిగూడెం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో హమాలీల పని ప్రదేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ కోట్లాదిమంది కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేస్తున్న బీజేపీ విధానాలకు నిరసనగా మేడేను పోరాట దినంగా జరుపుకోవాలని రమణ పిలుపునిచ్చారు.